క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారుల పాత్ర ఎంతో కీలకమని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధి విఠలాపూర్‌లో రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారులు బాగుంటే.. రవాణ వ్యవస్థ మెరుగు పడుతుందని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో గ్రామ వీధుల్లో సీసీరోడ్లను నిర్మిస్తున్నామని అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్, యాదయ్య, ఖాజ, శరత్‌కుమార్, రహీం, మణికంఠ పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షలతో, గ్రామ పంచాయతీ సమీపం నుంచి చేపట్టిన సీసీరోడ్డు పనులను సోమవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, స్థానిక నాయకులతో కలిసి సురేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో మర్పల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి నగేష్, రామేశ్వర్, నర్సింహులు యాదవ్, దివాకర్, రవిందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: గ్రామస్తులు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మరికల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల పరిధి మరికల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు పనులు చేసేందుకు జాబ్‌కార్డులు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో ఉపాధి పనులు నిర్వహించుకోవాలని అనుకుంటే.. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి పరిస్థితుల నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిర్మాణ దాతకు సన్మానం



సంతోష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో పురాతనమైన చెన్నకేశవ ఆలయ నిర్మాణానికి తాండూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రొంపల్లి సంతోష్ ముందుకు వచ్చారు. ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షలతో నిర్మాణ సామగ్రి అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు సన్మానించారు.

వెంటనే టాక్స్ చెల్లించండి..

రవాణాశాఖ అధికారి వెంకట్ రెడ్డి



అనంతగిరి: ట్యాక్స్ చెల్లించని 153 వాహనాలను సీజ్ చేసి, రూ.46.62 లక్షల జరిమానా విధించి, వసూలు చేశామని రవాణాశాఖ జిల్లా అధికారి వెంకట్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ట్యాక్స్ చెల్లించని వాహనదారులు ఆన్‌లైన్ లేదా మీసేవా ద్వారా చెల్లించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని, మొబైల్ నంబర్‌కు లింక్ చేసుకోవాలని, దీంతో వాహనానికి సంబంధించిన సమాచారం, ఫిట్‌నెస్, రెన్యువల్, టాక్స్ పేమెంట్స్ తదితర సమాచారం ఫోన్లో పొందవచ్చని పేర్కొన్నారు.

అంత్యక్రియలకు సహాయం

కుల్కచర్ల: మండల పరిధి ఘణపూర్ గ్రామానికి చెందిన సత్యమ్మ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు వెంకట్.. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మేకల హన్మంతు, రాములు, బి.రాములు, బీరయ్య ఉన్నారు.

గ్రామాల్లో నీటి కటకట

ఐనాపూర్‌లో వారం రోజులుగా సరఫరా బంద్

- ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ మండిపాటు



ఐనాపూర్‌లో పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దోమ: వేసవితాపం మొదలు కాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ సౌకర్యం ఉన్నా.. నిర్వహణ లోపంతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సోమవారం దోమ మండలం ఐనాపూర్ గ్రామస్తులు పంచాయతీ మెట్లు ఎక్కారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వారం రోజులగా తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ సమీపంలోని బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని పేర్కొన్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామంలో నీరు రావడం లేదని పలుమార్లు అధికారులు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. భగీరథ నీరు సమయానికి రాకపోవడం, ఉన్న బోర్లలో మోటార్లు లేక.. నీటి సరఫరాలో అంతరాయం కావడంతో ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. దీంతో సమీప బోర్లు, బావులే దిక్కయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. అవి దూరంగా ఉండడంతో మండుటెండలో నీరు తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటిని సక్రమంగా సరఫరా చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బోరు బావులే దిక్కు

వారం రోజులుగా గ్రామంలో నీరు రావడం లేదు. దీంతో సమీపంలోని వ్యవసాయ బోరు బావులు, బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అవే మాకు దిక్కయ్యాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తాగు నీటి కష్టాలు తీర్చాలి.

– పరంగళ్ల నర్సమ్మ, ఐనాపూర్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- డిజిటల్ తరగతుల ద్వారా విద్యనందించాలి
- కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్



పెద్దతండాలో డిజిటల్ తరగతులను ప్రారంభించిన లాల్యానాయక్

దోమ: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి పెద్దతండా పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ తరగతులను ప్రారంభిస్తుందని తెలిపారు. ప్రతి పాఠాన్ని డిజిటల్ బోధనలో టీవీల ద్వారా ప్రత్యక్షంగా చూపిస్తూ, విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీంతో వారికి సులభంగా అర్థమవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ పాఠాలతో నేర్చుకున్న జ్ఞానం స్థిరంగా ఉండడంతో పాటు అభ్యసన లక్ష్యాలు సాధించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు.

మెనూ ప్రకారం భోజనం

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. బ్రాహ్మణపల్లి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేశారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల గ్రౌండ్ గుంతల మయంగా ఉండడంతో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి.. మట్టిని పోయించి చదును చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను ఆయన అభినందించారు. పెద్దతండా హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవనాన్ని వినియోగంలోకి తేవాలి

నవాబుపేట: మండల కేంద్రంలో నిర్మించిన దివ్యాంగుల భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఆ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ అనురాధకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోలేదని, దాంతో అది నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. సంఘం సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా ఉందని, కావున వెంటనే భవనాన్ని ఉపయోగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సుదీర్, మోదిన్, ధన్‌రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లికార్జున ఉత్సవాలు

బొంరాస్‌పేట: మండల పరిధి నాందర్‌పూర్‌లో సోమవారం శ్రీమల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాబృందం ఆటపాటలతో ఆకట్టుకుంది. ఉత్సవాల్లో యాదవ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్, కురుమ సంఘం నాయకులు అన్నయ్య, పాండు, నర్సింహులు, పుర్ర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి వాటర్ స్పోర్ట్స్ అకాడమి(క్రీడా పాఠశాల)లో కాయకింగ్, కెనోయింగ్, ఫెన్సింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు గిరిజన బాలబాలికల నుంచి అడ్మిషన్లు కోరుతున్నామని ఆ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తగరతిలో బాలురు 10, బాలికలకు 10 సీట్లు ఉండగా, మిగతా 6,7,8 తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 9వ తేది వరకు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8639388553లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి

కుల్కచర్ల: పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం దాస్యనాయక్‌తండాలో ఉపాధిహామీ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. గతంలో వారికి ఇందిరమ్మ ఇళ్లు, భూములను ఇచ్చింది కాంగ్రెస్సేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఉపాధ్యక్షుడు నర్సింహ నాయక్, వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, రాజు, చంద్రయ్య, రవి, ఆనందం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

యాలాల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేయించిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి చలివేంద్రం ఏర్పాటు చేశారని, ఇందులో ప్రతి సోమవారం అంబలిని ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, డైరెక్టర్లు శ్రీనివాస్, రాజు, నాయకులు నాగయ్య, అహ్మద్, మారుతీ, అశోక్, సంకారం లాలప్ప, నర్సింహులు, శేఖర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక

బొంరాస్‌పేట: మండల పరిధి ఎన్కేపల్లిలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. తాజాగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో సీసీరోడ్డు, మురుగుకాల్వ నిర్మాణం, బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు, మురుగు కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం పాఠశాల ప్రహరి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగది నిర్మాణానికి కొలతలు తీసుకున్నారు. నిధుల మంజూరుకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. గ్రామంలోని మహిళా సంఘాలు ఇచ్చిన వినతి మేరకు త్వరలో ఆ సంఘాలకు గ్రామసంఘం భవనం మంజూరు కానున్నట్లు సమాచారం. కాగా.. సీఎం నియోజకవర్గంలో నిధుల మంజూరు, అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతున్నాయని పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇందులో శేఖర్ ఉన్నారు.

ఎంపీఓకు ఘన సన్మానం

కొందుర్గు: ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీఓ లాలయ్యను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బదిలీపై వచ్చి కొందుర్గులో విధులు చేపట్టిన సూపరింటెండెంట్ గణపతితో పాటు ఎంపీఓ విజయ్‌కుమార్‌పాల్, పంచాయతీరాజ్ ఏఈ మధుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ మాట్లాడుతూ.. ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమేనని, విధుల్లో ఉన్న రోజుల్లో ప్రజలకు జవాబుదారీగా పనిచేయడమే ఉద్యోగి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాబయ్య, సురేఖ, అనురాధ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళ్లిన ఎంపీఓ, అధికారులను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కస్తూర్బాలో ఎలుకల బెడద

- ఆందోళన చెందుతున్న బాలికలు
- తహసీల్దార్, ఎంపీడీఓలకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- తనిఖీ చేసిన అధికారులు



కేజీబీవీలో విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

నవాబుపేట: కస్తూర్బా వసతి గృహంలో ఎలుకలు బాగా పెరిగాయని, తమ పిల్లలను కరుస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఈఓ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ జైరాం, ఎంపీడీఓ అనురాధలకు ఫిర్యాదు. వారి ఫిర్యాదు మేరకు సోమవారం కేజీబీవీని అధికారులు తనిఖీ చేశారు. అనంతరం బాలికలతో మాట్లాడగా.. హాస్టల్‌లో ఎలుకల బెడద పెరిగిందని, ఎక్కడ కరుస్తాయోనని భయపడుతున్నామని విద్యార్థినులు తెలిపారు. రాత్రి వేళలో నిద్ర పోలేకపోతున్నామని ఆవేదన చెందారు. నాలుగు రోజుల్లో 8 మందిని ఎలుకలు కరిచాయని, సిబ్బంది ఆస్పత్రికి తీసుకెళ్లి సూది మందు ఇప్పించారని వివరించారు. ఎలుకల విషయాన్ని స్పెషల్ ఆఫీసర్ శ్రీలత, ఉపాధ్యాయులకు చెప్పగా.. ‘మీరు బిస్కట్లు తెచ్చుకున్నందుకే ఎలుకలు వస్తున్నామని, బిస్కట్లు తినొద్దని’ చెబుతున్నారని ఆరోపించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని, ఎలుకలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని చెప్పారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎంపీడీఓ సోమలింగం

కుల్కచర్ల: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్ల అంశంపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో.. సోమవారం ఆయన మండల పరిధి విఠలాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సరుకుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. వాటి నాణ్యతను పరీక్షించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని వివరించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ.. లబ్ధిదారులు కొందరు శివమాల ధరించడానికి ముందు తీసుకున్న గుడ్లను ఇప్పుడు వాడుతున్నందుకే అవి కుళ్లిపోయాయని తెలిపారు. వేసవి నేపథ్యంలో గుడ్లను తీసుకునే క్రమంలో పరిశీలించి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, సురేందర్, అంగన్‌వాడీ టీచర్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మర్పల్లి: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద రెడ్డి, ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్ అన్నారు. మండల పరిధి పట్లూర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తన కోటా నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో సోమవారం స్థానిక నాయకులతో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు బలరాంగౌడ్, మహేశ్వరీ, మైపాల్‌రెడ్డి, శ్రీమంత్‌కుమార్, జైపాల్, ప్రవీణ్, అశోక్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు కృషి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, గంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం వారు సందర్శించారు. అనంతరం గ్రంథాలయంలో పుస్తకాలను, పాఠకుల హాజరు పట్టికను పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకోగా.. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా శంకర్‌పల్లి గ్రంథాలయంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా మరిన్నీ పుస్తకాలను కొనుగోలు చేస్తామని, మౌలిక సదుపాయాలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, నాయకులు ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేక.. ప్రజలకు తెలియక!

- ప్రజావాణికి స్పందన కరువు
- దరఖాస్తుల కోసం అధికారుల పడిగాపులు



ఫిర్యాదుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు

దుద్యాల్: ప్రజావాణి అంటే.. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు రూపంలో అందజేయాలి. అలా వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖకు పంపించి, సమస్య పరిష్కారానికి వారు కృషి చేస్తారు. కానీ.. ప్రజావాణికి ప్రజాధరణ కరువయింది. అవగాహన లేకనో.. ప్రజావాణి గురించి తెలియకనో కానీ.. సహాయక కేంద్రంలో అర్జీదారుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ప్రతి సోమవారం దుద్యాల మండలంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన పూర్తిగా కరువైంది. ఒక్క ఫిర్యాదు అందకపోవడం విడ్డూరంగా ఉంది. ఇలా స్పందన లేకపోవడానికి కారణం.. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన లేకపోవడమేనని తెలుస్తోంది. రైతు భరోసా ఎప్పుడు వస్తుంది. పీఎం యోజన డబ్బులు ఎప్పుడు పడతాయి? అనే విషయాలను ఒకరో ఇద్దరో రైతులు అడగడం తప్ప.. రాత పూర్వకమైన ఫిర్యాదులు అందడం లేదని అధికారులు వెల్లడిస్తున్నారు. దీనికి కారణం ‘ప్రజావాణి అంటే కలెక్టర్ కార్యాలయంలోనే నిర్వహిస్తారని, మండల కార్యాలయంలో నిర్వహించరు’ అనే నమ్మకంలో ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రజావాణి గురించి సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యక్రమం గురించి ప్రచారం చేయాలని, అవగాహన కల్పిస్తే.. తమ సమస్యలు వినిపించుకునేందుకు ప్రజలు ముందుకు వస్తారని పలువురు అభిప్రాయం పడుతున్నారు.

ఒక్క ఫిర్యాదు అందలేదు

ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు అందలేదని అధికారులు పేర్కొన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి హిమబిందు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు నిల్

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, ఆయా శాఖల అధికారులు వేచి ఉన్నప్పటికీ.. ఒక్క దరఖాస్తు రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుణమాఫీ కాలేదు.. రైతుభరోసా లేదు



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధారూరు: ‘మాకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు. రెతుభరోసా అందలేదు’ అని పలువురు రైతులు ఆవేదనం వ్యక్తంచేశారు. సోమవారం కేరెళ్లి గ్రామానికి చెందిన 14 మంది రైతులు.. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు త్వరగా రైతుభరోసాతో పాటు రుణమాఫీ కాని వారికి వెంటనే అయ్యేలా చూడాలని కోరారు.